# వీడ్కోలు

అది ఒక అనాధాశ్రమము. దేశనాయకులంతా కారాగారాల నవసిపోతూండగా, దేశమంతా కరువుకాటకాల నల్లాడిపోతూవుండగా, ఒకానొక మహాశయునకు సుహృద్భావంమూలంగా నిర్మింపబడి, అత్యంతాభివృద్ధి నందగలిగింది అది.

ఆ ఆశ్రమవాసులంతా అపార ఆనందోత్సాహాల, సంధ్యపడటంతడవుగా దీపమాలలతో ఆశ్రమాన్నంతా అలంకరించి, దేదీప్యమానంగా వెల్గొండజేసి దీపావళీపండుగ సంతసాన్ని అనుభవించసాగారు.

అట్టి సమయంలోనే ఆ యువకుడు ఆశ్రమము లోనకు ప్రవేశించి ఒక యువతినిజేరి—ఆ ఆశ్రమవాసినియై,అధ్యాపకురాలై జీవితాన్ని గడుపుతూన్న ఆశాదేవినిగూర్చి అడిగాడు.

ఆ యువతి అతని వెంటబెట్టుకొని ఆశ్రమములోని ఆశాదేవి నివసించే గదిముందుకు తీసుకొనిపోయి నిలచింది. దగ్గఱగ వేసివున్న తలుపులను నెట్టి పూర్తిగా తెఱచింది. ఆ యిరువురూ లోనకు ప్రవేశించారు.

వాళ్ళు అలా లోనకుజేరడమేతడవుగా ఆశ్చర్యం వారి నావహించింది. నిశ్చేష్టితులై అలానే నిలచిపోయారు. రెప్పలు వాల్చకుండా యిరువురూ యెదుటకు చూడసాగారు. వాళ్ళయెదుట యేముందీ?

ఆశాదేవి నిర్మలభక్తిభావంతో మోకాళ్లపై కూర్చుండి ముకుళితనయనయై—అంజలిబద్ధయైవుంది. ఆమెయెదుట పసుపు కుంకుమలతో శోభిల్లుతూవున్న ఓ పీఠం! దానిపైన ఓ చిత్రపఠం!! ఆ పీఠం చుట్టూ పేర్చబడి నిశ్చలంగా వెల్గుతూన్న దీపాలు. ఆ దీపాలే ద్విగుణీకృతంగా ఆ చిత్రపఠం అద్దంలో ప్రతిఫలించినై!—ఆ పీఠంప్రక్కగానే ఓ రాట్నం పసుపు పూయబడివుంది.

నిశ్శబ్దంతో నిండివున్న ఆ గదిలో నిముషాలు కొన్ని గడచినై! మరోనిముషం ముగుస్తూందనగానే ఓ పెనునిట్టూర్పు ఆ నిశ్శబ్దతను భంగపరచింది. శిలాప్రతిమవలెవున్న ఆశాదేవి చలించింది. ఆమెనించి నిట్టూర్పు వెలువడింది. కనుల నీళ్ళునిండి ధారగా ప్రవహించినై! ఆశాదేవి అశ్రుపాతాన్ని పైటతో అరికట్టుతూ—దీనాతిదీనంగా ఆ చిత్రపఠమును సంబోధించుతూ—

'అజయా! అప్పుడే మూడేండ్లు నిండినయ్ నీ ఆశ అనాధాశ్రమములోజేరి. నీ ఆశ అనాధయైపోయింది అజయా!...ఏ దీపావళీపండుగనాడు నీ ఆశను విడచి—అమితవిషాదంతో తిరిగి యుద్ధంలోకి వెళ్ళిపోయావో—ఆ దీపావళీపండుగే ఆశకు స్మరణచిహ్నంగా నిలచిపోయింది. జీవితమున్నంత వరకూ యీ దీపావళీపండుగ అజయుని అంతిమచిహ్నంగా ఆశకు తీరని వ్యధితకారణమై వుంటూంది—అజయా! నిజంగానే నీవు మరణించినావా?—' గొంతు రుద్ధమయ్యింది. దుఃఖం ముంచుకు వచ్చింది. వెక్కి వెక్కి యేడుస్తూ—తన మనస్సును తాను తన అధికారంలో వుంచుకోలేకపోయింది ఆ అభాగిని.

అంతవరకూ ఆమె వెనుకభాగాన నిలచివున్న ఆ యిరువురు వ్యక్తుల కన్నులనుండికూడా అశ్రులు రాలినై!—ఆశాదేవి ఆవేదనా—అస్థిరతా చూచి సహించలేక ఆ యువతి ఆమెను వూరార్చ ముందుకు పోబోయింది; అది గుర్తించిన ఆ యువకుడు వారించాడు అప్రయత్నంగానే ఆమె కోమలకరపల్లవాన్ని పట్టుకొని—

ఆ యువతి కంపించిపోయింది, అతని యీ అవనీతికరమైన కార్యానికి. తన చేతిని విడిపించుకుంటూనే—'చేయివదలండీ! యిలాచేయడం గౌరవనీయమైన —'

అప్పటికే వెనుదిరిగి చూచింది ఆశ. ఆ యిరువురనూ తీవ్రదృష్టిని పరికించింది. ఆగ్రహంతో కంపించిపోతూన్న తనువు—ఆనందంతో నిండిపోసాగింది. ఆశ్చర్యంతో—అనుమానంతో—కనులను

సులుముకొన్నది. నోరు తెరిచి—మెల్లన లేచి—పిచ్చిదానిలా వాళ్లదగ్గఱకు మెల్లమెల్లన వచ్చి నిలచింది.

ఆశాదేవిలోని ఆ మార్పుకు భయపడిపోయింది ఆ యువతి. విచలితహృదయంతో చూడసాగింది. ఆశ అలానిలచి—అతనిచూచి—చూచి—పట్టరాని ఆనందంతో—అస్ఫుటంగా—'అజయా!... నువ్వు ...బ్రతికి వచ్చావా ? ... అ—జ—యా !' అంటూనే అతనిపైకి వొరిగిపోయింది.

ఆ స్థితిని అనుమానిస్తూనేవున్న అజయుడు అర్థాంగిని కౌగిటకు పట్టుకున్నాడు. స్మృతివిహీనయైపోయిన ఆశను మెల్లన తీసుకొనిపోయి ఓ ప్రక్కగావున్న మంచంపై పండుకోబెట్టాడు.

ఆశాదేవినోట నా మాటలు విపడమే సంభ్రమంతో అజయునీ—ఆ చిత్రపటాన్నీ పరిశీలించి చూడసాగింది ఆ యువతి. ఎప్పుడైతే ఆశ అలా మూర్ఛపోయిందో తత్‌క్షణమే ఆమె బైటకు పరుగుపెట్టి ఆశ్రమనిర్వాహకురాలైన అంజలీదేవిని వెంటబెట్టుకవచ్చింది అన్ని సంగతులూ చెప్పుకుంటూను.

అజయుడు చన్నీళ్లతో ఆశ మొగాన్ని తడిపి—మెలమెల్లన విసురుతూ—తలను నిమురసాగాడు అనేక పూర్వస్మృతుల జ్ఞప్తికి తెచ్చుకుంటూనే.— ఆ సమయంలోనే అంజలీదేవి, ఆ యువతి లోనకు రావడంవల్ల అవన్నీ అంతర్హితమైపోయినై అజయుని విడచి.

వాళ్లను చూచీచూడటమే లేచినిలచాడు వినయభావంతో. అతని ఆ వినయానికి అలరింది అంజలీదేవి. కూర్చుండమని తానూ ఆశాదేవికి మరో ప్రక్కగా కూర్చుండి—

'అజయ బాబూ !—'

అప్పుడే స్మృతికలిగిన ఆశ అంజలీదేవినిచూచి—చట్టునలేచి మొగం ఆమె ఒడిలోబెట్టి కన్నీళ్ళు గార్చసాగింది. ఆమె ఆ ప్రవర్తన అంజలీదేవి హృదయాన్ని నీరుగావించింది. అమితానురాగంతో ఆశాదేవి వీపున చేతినిరాస్తూ—"ఏడవకు ఆశా ! ఆనందించవలసిన సమయంలో యేడ్వటమా?—లే ! లే!! అమాయకురాలా ! కన్నులుతుడుచుకో—" అని లేవదీసి కూర్చుండబెట్టింది.

ఆశ తలవాల్చుకునే కన్నులను చీర చెంగుతో ఒత్తుకుంటూ—హృదయాన్ని తేలికబరుచుకో ప్రయత్నించసాగింది.

ఆశలోని అశేష సౌందర్యానికి ఆ దీనతాభావం యింకా యెక్కువశోభను కలుగజేసింది. ప్రేమతోనిండిన కనుల నా మొనుచూస్తూ—

మీరు నన్ను సజీవునిగా చూడ్డంవల్ల ఆశ్చర్యపోతూ నా చరిత్ర వినాలనుకుంటూన్నారు.—అది సహజమే. నా చరిత్రను వినిపించడంకూడా తప్పనిసరియైన కార్యమేను.-వినండి చెపుతూన్నాను: —నేనూ ఆశా కోరి పెండ్లిచేసుకున్నాం. ఆనాటికి మా సంసారం చాల ఆనందంతో గడచిపోతూంది. కాలం గడుస్తోన్నకొలదీ మా స్థితి చిదికిపోసాగింది. అంతపెద్ద సంసారానికి ఆశా నేనూమాత్రమే మిగిలాం ఆఖరుకు. సంసారభారం మోయడం నావంతుకు మిగిలింది.— ఏదో యింత సంపాదించి కాలాన్ని గడుపసాగాను. కాని రోజు రోజుకూ మా స్థితి దుర్భరమైపోయింది. వున్నపని కాస్తా వూడిపోవడం—తిరిగి పనిలేక—తిండిలేక మలమల మాడిపోవడంకూడా సంభవించింది. ఎటుచూచినా నిరాశ ! ఎలా బ్రతుకు వెళ్ళబోయడమోకూడా అర్థంకాలేదు. అంతలో యుద్ధం ప్రారంభమైంది. సైనికులలో జేరమని అనేకులు సలహానిచ్చారు. ఆలోచించి—ఆలోచించి— ఏదారీ— ఆధారము లేని నాకు ఆదారీ—ఆ ఆధారమే సరియైనదిగా తోచడంతో తక్షణంపోయి సైనికునిగా జేరిపోయాను. అన్నీ పూర్తియైన తరువాత ఆశకు చెప్పాను. ఆమె అనేక విధాల వద్దని చెప్పింది.

"జగం"
జాతీయ
రచనామండలి

నేనూ అనేకవిధాల బోధించి శలవుపుచ్చుకొని వెళ్లిపోయాను. అక్కడనించే డబ్బు పంపేవాణ్ణి. వుత్తరాలు వ్రాస్తూవుండేవాణ్ణి. సంవత్సరం గడచింది అలా. నెలరోజుల శలవుమీద యింటికి వచ్చాను. ఆనందంగా ఆశా నేనూ ఆ నెలరోజులూ గడపివేశాం. మా ఆనందంలో ఆనెలా— అరనిముసంలా అంతమైంది. ఆఖరురోజు. సరిగా దీపావళి. ఆనాడు దీపాలతో యింటిని అలంకరించింది ఆశ. పండుగలో పాల్గొని అర్ధరాత్రం గడువకముందుగానే అనునయించి అచ్చటనించి బైలుదేరి వెళ్లిపోయాను. ఆ వెళ్ళడమే మమ్మల్ని మరోదేశం పంపారు. అచ్చట దిగడమే యుద్ధం మమ్మల్ని తాకింది. ఆ యుద్ధంలో మేం తలకొకదారి అయిపోయాం. శత్రువు నన్నూ నాతోపాటుగా చాలామందినీ ఖైదీలుగా పట్టుకపోయాడు... అచ్చట చాలాకాలం గడిపాం. యుద్ధం ముగిసింది. విడుదల కలిగింది. ఇంటిముఖంపట్టాం. ఎంతో ఆనందంతో యింటికిజేరాను. ఎన్నో ఆలోచనలతో— ఆశను తలచుకొని యేడ్చేవాణ్ణి. నా స్థితిగతులు తెలియక ఆశ యేమైపోయిందో యెలావుందో అనుకుంటూనే వచ్చాను. ఇంటిని జేరడమే నా ఆశ నాకు కనిపించలేదు. ఒళ్ళు చల్లబడిపోయింది. నిలువునీరై కూలబడిపోయాను. నన్నుజూచి ఆ ప్రకయింటివారు ఓదార్చి సజీవగా యీ ఆశ్రమంలో నా ఆశ వుంటూందని చెప్పారు. ఆమాట ఆరిపోసిద్ధమైన జీవనజ్యోతిని తిరిగి వెల్గొందజేసింది.— వాళ్ళు వెళ్ళవచ్చులే—యీనాటికి మాయింట నుండకుంటూన్నా వినకుండానే బైలుదేరి యిచ్చటికివచ్చి వేశాను. ఇదీ నాకథ.—ఇలానే రావడంలో మీ ఆశ్రమ నియమాలకేమైనా విరుద్ధమైతే నన్ను క్షమించండి—

కన్నీట తనకథ నాపుతూ—చేతులు జోడించాడు అజయుడు. అంజలి అతని వారిస్తూ "అజయబాబూ! ఆనందసమయమిది. అత్యంత ఆశ్చర్యకరమైన యీఘటనమూలంగా యేకొద్ది నియమభంగం వాటిల్లినా అది అంతగా గణనసేయ నక్కరలేదులే. —ముందు మీరులేచి భోజనానికి నడవండి. సుజా! అజయునీ—ఆశనూ వెంటబెట్టుకొని భోజనాగారానికి తీసుకొనిరా. నేనీ సంతోషవార్త మనవాళ్లకు తెలియబరచి—వాళ్ళనుసైతం అచ్చటకు ఆహ్వానిస్తాను. పండగ సంతోషంతో యీ సంతోషము ఆశ్రమాన్ని అపారఆనందాబ్ధి నోలలాడించుతూంది. లే! ఆశా! నడూ!—

ఇలా అంటూనే అంజలీదేవి విప్రఫుల్ల హృదయంలో బైటకు తొందరతొందరగా వెళ్లిపోయింది.

ఆశా—సుజాతా— అజయబాబులు సైతం ఆమె వెనువెంటనే నడుస్తూ గదినివిడిచిపోయారు.

౨

ఆశ్రమమంతా హర్షధ్వానాలు — దిపకాంతుల తేజరిల్లిపోయింది. అందరిభోజనాలూ అయిపోయిన తరువాత—అంజలీదేవి అజయునీ ఆశనూ తనదగ్గఱ నిలుపుకుంది. తక్కినవారికి శలవిచ్చి పంపివేసింది. సుజాతను పిలచి చెవిలో—ఏదో చెప్పి పంపి—చిరునవ్వుతో—'ఆశాదేవీ! యింతవరకూ నీవు ఆశ్రమంలో అందరి అనురాగాభిమాన పాత్రవై —అధికశ్రమతో ఆశ్రమాభివృద్ధికి పాటుపడ్డావు. నీవల్ల యెంతో వున్నతినందిందీ ఆశ్రమమ్. ఇట్టి ఆశ్రమాన్ని నీవు విడచి—'

కంఠం మూసుకుపోయింది. అంతలోనే ఆశాదేవి—విహ్వలభావంతో—'నేను విడచి పోలేను. ఇచ్చటనే వుంటాను దేవీ! ఆశ్రమాన్ని—'


కథాంజలి

అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు లోను దొరకును. వెల 0-2-0

చెదరిన స్థయిర్యాన్ని, తిరిగి ఒక్కచోటుకు చేర్చుకొని 'పిచ్చితల్లీ! అలావుంటేందుకు వీలులేదమ్మా! లేకుంటే నిన్ను విడచిపెట్టగలనా? నీవు విడచి పోలేవని నాకూ తెలుసు. కాని విధిబలవత్తరం.— ఆశా! నీవు మఱచిపోతూన్నావు. నేడు నీవు అనాథవు కావు సనాథవు. నీకీ ఆశ్రమము చోటునొసంగ లేదు—నీ నాథునితో సుఖించు తల్లీ!—'

ఆ మాటతో నిర్ఘాంతపోయింది ఆశ. సుజాత వచ్చి కుంకుమ భరిణిని అంజలీదేవి చేతనుంచింది. అంజలీదేవి కుంకుమతో ఆశాదేవి ముఖమున తిలకముంచి—కౌగలించుకొని కన్నీళ్లు విడచింది.

ఆశ కౌగలినుంచి జారి ఆమెపాదాలవ్రాలి భక్తి ప్రేమల మ్రొక్కింది. అజయుడుసైతం అర్థాంగితో పాటు ఆమెపాదాలకుమ్రొక్కి కృతజ్ఞత తెలిపాడు.

సుజాత కుంకుమతో ఆశాదేవికి తిలకముంచి కౌగలించుకుంది. అంజలీసుజాతలా ఆలుమగల నాశీర్వదించారు.

దీపావళీ దివ్యవెలుగులలో ఆశాఅజయులను, ఆశ్రమవాసులందరూ ఏకకంఠమున ఆశీర్వదిస్తూ— వీడ్కోలునిచ్చారు, సుఖమయజీవితాలను గడపి ఆనందించండనీ;—పోయిరండని.

ప్రకృతిసైతం వాళ్ళకోరికనే బలపరుస్తూ— చల్లటిగాలినిబరపుతూ— పుష్పవర్షంలా — కొన్ని నీటిబిందుల చిలికి వీడ్కోలునిచ్చింది ఆశీర్వదిస్తూ—

ఏ దీపావళిపండుగ వ్యధితకారణమై అలరుతూందనుకుందో ఆ దీపావళీపండుగ ఆశాదేవికి ఆనందకరమైంది అనుకోనైనాలేని విధంగా ఒకటి తలుస్తే మరొకటి అవుతుందనడం ఇదేనేమో !!!


# "SCABIOL"

An Ideal Remedy For All Skin Diseases.

## స్కేబియాల్

తీట, ఉష్ణపుగడ్డలు, మొటిమ మున్నగు సకల చర్మవ్యాధుల నివారణకు అమోఘమయినది.

అంతటా దొరకును.

* ఏజంట్లు కావలెను *

*Apply to :*

**The Madura Cottage Industries,**

(Manufacturers & Representatives)

**17, Perumal Tank Street,**

MADURA.